క్లుప్తంగా

పన్నులు చెల్లించండి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ స్థలం, నీటి, డ్రైనేజీ పన్నులను వెంటనే చెల్లించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున పన్ను చెల్లింపులకు వీఎంసీ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసిందని, ఈ కౌంటర్లు ఆదివారం, సెలవు దినాల్లో కూడా పనిచేస్తాయని చెప్పారు. ఆయా ప్రాంతాల్లోని కౌంటర్లు ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

పాయకాపురం(విజయవాడరూరల్): పదవ తరగతి కామన్ పరీక్షలు రాసే విద్యార్థులకు సాక్షి మీడియా యాజమాన్యం స్టడీ మెటీరియల్స్ ఉచితంగా అందచేసింది. శనివారం ఎల్బిఎస్ నగర్ పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్ లో పదవ తరగతి చదువుతున్న 145 మంది విద్యార్థులకు భౌతిక శాస్త్రము, గణిత శాస్త్రాల్లోని ముఖ్యమైన అంశాలతో కూడిన ప్రశ్న మోడల్, ప్రశ్నా పత్రాలతో రూపొందించిన పుస్తకాలను ప్రధానోపాధ్యాయులు డాక్టర్ మైనం హుస్సేన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు ఎంతో అవసరమైన భౌతిక శాస్త్రము, గణిత శాస్త్రం ప్రశ్నా పత్రాల మోడల్ పేపరు పుస్తకాలు కామన్ పరీక్షలకు ఎంతో దోహద పడతాయన్నారు. ఈ పుస్తకాలను చదివి కామన్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆయన ఆకాంక్షించారు.

క్లస్టర్ సమావేశాలకు విధిగా హాజరుకావాలి



నున్న(విజయవాడరూరల్): విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెలా జరిగే క్లస్టర్ సమావేశాలకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విధిగా హాజరుకావాలని రాష్ట్ర పరిశీలకులు ప్రతీక్ భర్న అన్నారు. ప్రతి నెలా మూడో శనివారం హైస్కూల్స్, ఎలిమెంటరీ స్కూల్స్‌కు సెలవు ఉంటుందని, ఆ సమయంలో క్లస్టర్ సెంటర్‌లో సమావేశాలను నిర్వహించి సబ్జెక్ట్ వారీగా రివ్యూ జరుగుతుందన్నారు. విద్యార్థులు సబ్జెక్ట్ వారీగా ప్రతిభను కనబర్చేందుకు క్లస్టర్ సమావేశాలు ఉపయోగపడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సమావేశాలు నిర్వహిస్తోందన్నారు. ఎలిమెంటరీ విద్యార్థులకు 1,2,3 తరగతులకు ప్రత్యేకంగా, 4,5, తరగతుల ఉపాధ్యాయులతో రివ్యూ, హైస్కూల్ విద్యార్థులకు సబ్జెక్ట్ వారీగా రివ్యూ జరుగుతుందని చెప్పారు. బోధన పద్ధతులు మెరుగు పర్చడానికి షెడ్యూల్ లింక్ ఐ.ఎఫ్.వి ప్యానెల్‌లో వీక్షించే ఏర్పాటు చేశారు. సమావేశంలో మరో రాష్ట్ర పరిశీలకులు యజ్ఞ రాజావోలు క్లస్టర్ సమావేశాల ప్రాధాన్యతను వివరించారు. సిలబస్ పూర్తి చేయడం, సి.డి. గ్రేడ్ విద్యార్థుల ప్రోగ్రెస్ గురించి చర్చించారు. నున్న హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వి.భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో హైస్కూల్ ఫస్ట్ అసిస్టెంట్ రవిప్రసాద్, 45 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రైమరీ లెవెల్ రీసోర్స్ పర్సన్స్‌గా పి.మనోజ, వి.రత్నకుమారి వ్యవహరించారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



మధురానగర్ (విజయవాడ సెంట్రల్): మధురానగర్‌లోని గౌతమ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన పలువురును ఆలోజింపజేసింది. ఈ ప్రదర్శనలో 205 మంది పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఆలోచనలకు పదును పెట్టి 110 ప్రాజెక్టులను ప్రదర్శించారు. రోబోటిక్స్ టెక్నాలజీ, ఈజీ లాంగ్వేజ్ సొల్యూషన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, గణిత, బయాలజీ వంటి విభాగాల్లో ఎగ్జిబిట్లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ గవర్నర్ గద్దె శేషగిరి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ గవర్నర్ శ్రీనివాస రెడ్డి, టి. శ్రీనివాసరావు, ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ ఎన్‌వీఎస్‌వీ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వంటల పోటీలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాలులో జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా ఉత్సవ్–2025 ఆదివారం సాయంత్రంతో ముగియనుంది. ఈ నెల 8వ తేదీ మహిళా ఉత్సవ్ ప్రారంభమైంది. మహిళలు స్వయంగా తయారు చేసిన వివిధ ఉత్పత్తులను ప్రదర్శనతో పాటుగా అమ్మకాలు చేస్తున్నారు. నగరంతో పాటుగా పరిసర ప్రాంతాల నుంచి 50కు పైగా దుకాణాలను ఏర్పాటు చేశారని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ చెప్పారు. మహిళలు వ్యాపార మెలకువలను నేర్చుకోవడంతో పాటుగా మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఇలాంటి మహిళా ఉత్సవ్‌లు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు.

రోడ్లపైనే వాహనాల పార్కింగ్!

- నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు
- సింగ్‌నగర్‌లో రోజురోజుకు పెరుగుతున్న సమస్యలు
- మామూళ్ల మత్తులో ట్రాఫిక్ పోలీసులు



డాబకొట్లు సెంటర్ సర్వీస్ రోడ్డుపై నిలిపిన వాహనాలు



పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): అజిత్‌సింగ్ నగర్ ప్రాంతంలో ప్రధాన రహదారులు ఆక్రమణలకు గురవుతున్నాయి. రోడ్లపైనే వాహనాల పార్కింగ్‌తో సమస్య మరింత తీవ్ర రూపం దాల్చుతుంది. ముఖ్యంగా డాబకొట్లు సెంటర్, లూనసెంటర్, ఇందిరానాయక్‌నగర్ సర్వీస్ రోడ్లపై నిత్యం పదుల సంఖ్యలో వాహనాలను పార్కు చేస్తున్నారు. దీంతో ఈ రోడ్లపై ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతునాయని స్థానికులు చెబుతున్నారు. దెబ్బతిన్న కార్లు, మినీట్రాన్స్‌పోర్టు వాహనాలు, మొరాయించిన ఇతర వాహనాలను రోడ్డుకు ఇరువైపుల రోజుల తరబడి నిలిపి ఉంచుతున్నారు. అపార్టుమెంట్లు కొనుగోలు చేసిన వారికి పార్కింగ్ సౌకర్యం లేక పోవటంతో రోడ్లపైనే తమ వాహనాలు నిలుపుతున్నారని స్థానికులు అంటున్నారు. దీంతో 30 అడుగుల రోడ్లు కాస్తా 10 అడుగులకు కుంచించుకుపోయాయని వాపోతున్నారు.

నిత్యం తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు....

నిత్యం రద్దీగా ఉండే సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు ఏర్పాటు చేసిన సర్వీస్ రోడ్డు కూడా ఆక్రమణలకు గురికావటంతో ఈ ప్రాంతంలో రోజూ ట్రాఫిక్ ఇబ్బందులు తప్పటం లేదు. సర్వీస్‌రోడ్డును ఆక్రమించి ఒక పక్క కూరగాయల దుకాణాలు, మరో పక్క టిఫిన్ సెంటర్లు ఏర్పాటుచేశారు. దీంతో పాటు వాహనాల అనధికారిక పార్కింగ్‌తో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెబుతున్నారు.

ఉదయం, సాయంత్రం వేళల్లో మరిన్ని ఇబ్బందులు....

ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య మరిత ఎక్కువగా ఉంటుందని ఈ సమయాల్లో స్కూల్స్, కళాశాలల నుంచి వచ్చే ప్రైవేటు వాహనాలతో పాటు వాటికి దారి లేకుండా రోడ్లపై నిలిపే లారీలు, మిని ట్రాన్స్‌పోర్టు వాహనాలు, ఆటోలతో కిలోమీటర్ ప్రయాణించాలంటే గంటల సమయం పడుతుందని వాపోతున్నారు.

పట్టించుకొని ట్రాఫిక్ పోలీసులు.....

ఈ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవటం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి వాహనాలను రోడ్లకు ఇరువైపులా నిలుపుతున్నా వాటిని తొలగించక పోవటం, రోడ్లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నా పట్టించుకోకపోవటం పట్ల స్థానికులు మండిపడుతున్నారు. నిత్యం వ్యాపారులు ఇచ్చే మామూళ్లకు అశపడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సందేశాత్మకంగా సాగిన నాటికల ప్రదర్శనలు

- ప్రారంభమైన జాతీయ సాంఘిక నాటికల పోటీలు
- రెండురోజులపాటు నిర్వహణ



ఉక్కు సంకెళ్ళు నాటికలోని సన్నివేశం

విజయవాడ కల్చరల్: యూత్ స్పోర్ట్స్ కల్చరల్ ఫోరమ్, కళావిపంచి, శ్రీ కృష్ణా తెలుగు థియేటర్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో రెండు రోజులపాటు నిర్వహించే సాంఘిక నాటిక పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలి నాటికగా మహతి క్రియేషన్స్ వారి ఉక్కు సంకెళ్ళు ప్రదర్శించారు. 1840 లో కోలకత్తా లోని ఈస్ట్ ఇండియా కంపెనీ అక్కడి జాలర్లపై పన్ను విధిస్తుంది. జాలర్లకు మద్దతునిస్తూ రాణి రాష్మోనీ ఉద్యమం చేస్తుంది. ఈ నేపథ్యంలో నాటిక సాగుతుంది. రెండవ నాటికగా హేలాపురి కల్చరల్ అసోసియేషన్ వారి సారీ రాంగ్ నంబర్ నాటికను ప్రదర్శించారు. భారతీయ వివాహవ్యవస్థకు మూలం సనాతన ధర్మమని కానీ నేడు అది తన ఉనికిని కోల్పోతోంది. మగవాడు పరస్త్రీ వ్యామోహంలో పడితే ఏం జరుగుతుందో చెప్పటమే నాటకం ప్రధాన ఉద్దేశం. మూడవ నాటికగా న్యూస్టార్ మోడరన్ థియేటర్ 27 వ మైలు రాయి ప్రదర్శించారు. కార్యక్రమాలను ఐ అండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ పోతుల కిరణ్ కుమార్ ప్రారంభించారు. సాహిత్యమైనా, నాటకమైనా, సినిమా ఐనా సామాజిక ప్రయోజనం కలిగి ఉండాలన్నారు. వివిధ రంగాలకు చెందిన హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్, జవ్వాది దాశరథి శ్రీనివాస్, జీవీజీ శంకర్, బొప్పన నరసింహారావు, అంకం భుజంగరావు పాల్గొన్నారు.

విజయవాడలో వుమ్మిడి బంగారు జ్యూయలరీ ఎగ్జిబిషన్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ బందరు రోడ్డులోని లెమన్ ట్రీ ప్రీమియర్ హోటల్‌లో వుమ్మిడి బంగారు జ్యూయలర్స్ (వీబీజే) ఎగ్జిబిషన్ ఏర్పాటైంది. ప్రదర్శన, అమ్మకాలు రెండు రోజుల పాటు జరగనున్నాయి. భారతదేశపు అత్యంత విశ్వసనీయ వారసత్వ ఆభరణాల బ్రాండ్ వీబీజే అద్భుతమైన బ్రైడల్ కలెక్షన్స్ కస్టమర్లకు అందుబాటులో ఉంచింది. ప్రదర్శనలో సున్నితంగా రూపొందించిన బంగారు, వజ్రాల ఆభరణాల అద్భుతమైన శ్రేణిని ప్రదర్శించారు. వీబీజే మేనేజింగ్ పార్టనర్ అమరేంద్రన్ వుమ్మిడి ప్రదర్శన విశేషాలను వివరించారు. 'చక్కటి ఆభరణాలకు ప్రసిద్ధి చెందిన విజయవాడ నగరానికి వీబీజే అనుభవాన్ని తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రదర్శనలో వివాహ సేకరణలు, చెవి పోగులు, నెక్లెస్, చెయిన్లు, గాజులు, ఉంగరాలతో సహా విస్తృత శ్రేణి ఆభరణాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఒక్కటి అసమానమైన నైపుణ్యంతో, కచ్చితమైన శ్రద్ధతో రూపొందించి కస్టమర్లకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన 16వ తేదీ కూడా ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందన్నారు.

వైఎస్సార్ సీపీ 33వ డివిజన్ కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయం ప్రారంభించిన అనంతరం పార్టీ నేతలతో మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రజలకు మరింత చేరువగా ఉండేందుకు డివిజన్ కార్యాలయాలు ఎంతో దోహదపడతాయని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. శివాజీకేఫ్ సెంటర్‌లో 33వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తితో కలసి శనివారం మల్లాది విష్ణు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 33వ డివిజన్ కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చెందిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల కాలంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టకపోవడంతో స్థానికంగా అనేక సమస్యలు తిష్ట వేశాయని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజల తరపున పోరాటానికి వైఎస్సార్ సీపీ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. అనంతరం కార్పొరేటర్ శర్వాణమూర్తి మల్లాది విష్ణుని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ దోనెపూడి శ్రీనివాసరావు, నాయకులు మైలవరపు రామకృష్ణ, కృష్ణ మోహన్, నాదెండ్ల రవిశంకర్, మారుతీ, వెంకట చంద్రశేఖర్, కూనపులి ఫణి, శిష్టా సీతారామ్ పాల్గొన్నారు.

లలితా సహస్ర నామ పారాయణం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శనివారం లలితా సహస్ర నామ పారాయణ, శ్రీదేవి ఖడ్గమాల స్తోత్రం, అమ్మవారి నామ పారాయణ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మ వారి ఆలయ ప్రాంగణంలోని మహా మండపం ఆరో అంతస్తులో హైదరాబాద్‌కు చెందిన సులోచన ఫౌండేషన్ ఆధ్యాత్మిక సంస్థ ఆధ్వర్యంలో పారాయణ కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పారాయణంలో సుమారు 350 మందికి పైగా మహిళలు పాల్గొని ఏక కంఠంతో పారాయణం చేశారు. సంస్థ వ్యవస్థాపకురాలు శైలజ పర్యవేక్షణలో పారాయణం సుమారు మూడు గంటల పాటు సాగింది. అనంతరం పారాయణంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందించారు.

'నేను బెజవాడ లోకల్'

సినీ నటుడు రాజేంద్రప్రసాద్



మాట్లాడుతున్న సినీ నటుడు రాజేంద్రప్రసాద్



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): 'నేను బెజవాడ లోకల్... బెంజిసర్కిల్ సెంటర్‌లో పెరిగినోడిని.. వన్‌టౌన్‌లో సైకిల్‌పై తిరిగినోడిని....' అంటూ ప్రముఖ సినీ నటుడు రాజేంద్రప్రసాద్ నగరంలో సందడి చేశారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ 17వ వార్షిక వేడుకలు ఆ కళాశాల ప్రాంగణంలో శనివారం సాయంత్రం అత్యంత ఉత్తేజపూరిత వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన నటుడు రాజేంద్రప్రసాద్ తన ప్రసంగంతో విద్యార్థులను ఉత్తేజపరిచారు. తాను బెజవాడ లోకల్ అంటూ సందడి చేశారు. ప్రధానంగా విద్యార్థులు తమలోని ప్రత్యేకతను గుర్తించి దానికి పదును పెట్టాలన్నారు. తాను ఇంజినీరింగ్ చదివినా, నటుడుగా ఎదగాలని శ్రమించానన్నారు. అనేక ఆటుపోటులను ఎదుర్కొనన్నారు. అలాగే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా విజయం సాధించానని వివరించారు. అలాగే విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో మంచి స్థాయి లభించే వరకూ పాటుపడాలని సూచించారు. మిమిక్రీ ఆర్టిస్ట్ భవిరి రవి వివిధ నటుల కంఠాలను అనుకరించి విద్యార్థులను అలరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందించారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు చలవాది మల్లికార్జున రావు, చిట్టా అమర్ సుధీర్, కళాశాల కమిటీ ఉపాధ్యక్షులు చిట్టూరి ఆనందసుధాకర్, పొట్టి సురేంద్రకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ తదితరులు ప్రసంగించారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు అలరించాయి.

మధురంగా పంచరత్న కీర్తనల గోష్ఠిగానం



కీర్తనలు వీణపై పలికిస్తున్న సంగీత విద్వాంసులు

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతీ సంగీత సమితి ఆధ్వర్యంలో 9 వ అఖండ ఖచ్ఛపీ మహోత్సవాన్ని దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు సరస్వతీదేవికి స్వరార్చన నిర్వహించారు. సద్గురు త్యాగరాజ స్వామి రచించిన ఘనరాగ పంచరత్న కీర్తనలు జగదానందకారక, దుడుకుగల, సాధించెనే ఓమనసా, కనకన రుచిరా, ఎందరో మహానుభావులు కీర్తనలు వీణపై పలికించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు కొక్కొండ సుబ్రహ్మణ్యం, కొమ్మాజోస్యుల ఉదయలక్ష్మి, జేవీఎల్ కల్యాణి, కావూరి హేమలక్ష్మి, కోట శాంకరి, అయ్యగారి సత్యప్రసాద్, కేఎస్ గోవిందరాజన్ తదితలు వాగ్గేయ కారుల కీర్తనలు ఆలపించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎస్ చక్రధర్ మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతానికి పూర్వవైభవం తీసుకురావాలన్నారు. ఏటా అఖండ కచ్ఛపీ మహోత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకుల కృషిని అభినందించారు. సంగీత సమితి వ్యవస్థాపక కార్యదర్శి సీవీ రావ్, వైస్ చైర్మన్ చిట్టా రామలక్ష్మి నిర్వహించారు. సంగీత విద్వాంసులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

ఎస్ఆర్ఆర్ కళాశాలలో స్వచ్ఛతాహీ సేవ



కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థులు

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): పరిసరాలు శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి అన్నారు. ఎస్ఆర్ఆర్ కళాశాలలో శనివారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని కళాశాలలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా ప్రాంగణాన్ని శుభ్రపరుచుకోవాలని సూచించారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో బాధ్యత పెరుగుతుందని చెప్పారు. తద్వారా సేవా భావం అలవడుతుందన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో సుమారు 1000 మంది విద్యార్థులు పాల్గొని స్వచ్ఛతాహి సేవ ప్రతిజ్ఞ చేసి కళాశాల ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కొల్లేటి రమేష్, స్వచ్ఛతాహి సేవ కోఆర్డినేటర్ సుధాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ యుగంధర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజధానిలో ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



ఘంటసాల వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహాన్ని అమరావతి రాజధానిలో ఏర్పాటు చేయాలని పద్మశ్రీ ఘంటసాల చైతన్యవేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఆలిండియా ఘంటసాల చైతన్యవేదిక, ఆదిలీల ఫౌండేషన్, తెలుగు కళావాహిని, జీఆర్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాయకుడు ఘంటసాల 51 వర్ధంతి, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద శనివారం నిర్వహించారు. వెంకటేశ్వరెడ్డి మాట్లాడుతూ జాతికి స్ఫూర్తినిచ్చిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఆంధ్రప్రభుత్వం ఘంటసాల జయంతి రోజున పురస్కారాలను ప్రదానం చేయాలని సూచించారు. ఘంటసాల చైతన్య ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రచయిత డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ ఘంటసాల లాంటి గాయకులు అరుదుగా కనిపిస్తారన్నారు. కార్యక్రమంలో తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, గోళ్ళ నారాయణరావు ,డాక్టర్ భాగ్యశ్రీ, సింగంశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకుడు కే డేవిడ్ రాజు,దుర్గాప్రసాద్, మోహన కృష్ణ, బ్రహ్మం, సూర్యకామేశ్వరి, దుర్గా నాగమణి, మల్లేశ్వరి, సుహాసిని తదితరులు ఘంటసాల పాటలను గానం చేశారు.

పరిసరాల శుభ్రతతో పర్యావరణ పరిరక్షణ



ప్రతిజ్ఞ చేస్తున్న కృష్ణయ్య తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పర్యావరణ పరిరక్షణతో పాటు, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రంగా ఉంచడంపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా సిద్ధార్థ కళాశాల ఎకోక్లబ్ విద్యార్థులతో కలిసి, ఏపీఐఐసీ కాలనీ రోడ్డు, రైతు బజార్‌తో పాటు పలు ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా తడిచెత్త, పొడిచెత్త , హానికర వ్యర్థాల్ని వేరుచేయడం, వాటిని విడివిడిగా డబ్బాల్లో వేసి మున్సిపల్ కార్పోరేషన్ వారికి అప్పగించడం వంటి వాటిపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి శర్వణనన్, చీఫ్ ఇంజినీర్ పి. ప్రసాదరావు, పర్యావరణ ఇంజినీర్ పి.శ్రీనివాస్, సీనియర్ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ వెన్నెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు.

స్కూల్ బస్సు డ్రైవర్లు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



డ్రైవర్‌కు హెల్త్‌కార్డు అందజేస్తున్న ఎంవీఐలు

గన్నవరం: స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్ల ఆరోగ్యంపై యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.పద్మాకర్ సూచించారు. స్థానిక విమానాశ్రయం ఎదురుగా ఉన్న రవాణా శాఖ వాహన పటుత్వ పరీక్ష కేంద్రంలో గత నెల రోజులుగా జరుగుతున్న రహదారి భద్రత మాసోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. డీటీసీ ఏ.మోహన్ ఆదేశాల మేరకు ఎంవీఐ పద్మాకర్ ఆధ్వర్యంలో బ్లడ్ గ్రూపింగ్, బీపీ, షుగర్, కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న 25 మంది స్కూల్ బస్ డ్రైవర్లకు ఉచితంగా పరీక్ష రిపోర్టులు, హెల్త్‌కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లకు ప్రతి మూడు నెలలకు ఒకసారి యాజమాన్యాలు వైద్య పరీక్షలు చేయించి హెల్త్‌కార్డులను అందజేయాలని చెప్పారు. డ్రైవర్లు సైతం వాహనం కండీషన్ విషయంలో తీసుకునే జాగ్రత్తలను వ్యక్తిగత ఆరోగ్యం పట్ల అంతే బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి..

వలంట్రీ హెల్త్, ఎడ్యుకేషన్ అండ్ ఎకానమిక్ డెవలప్‌మెంట్ యూనిట్ డైరెక్టర్ ఎం.వాసు మాట్లాడుతూ...దేశవ్యాప్తంగా ప్రతి ఏటా రోడ్డు ప్రమాదాల్లో 1.70 లక్షల మంది మృతి చెందుతున్నారన్నారు. ఈ ప్రమాదాలు కేవలం మానవ తప్పిదాలు, నిర్లక్ష్యం కారణంగానే జరుగుతున్నాయని చెప్పారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు డ్రైవర్లు మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. ఉచితంగా హెల్త్‌కార్డులు పంపిణీ చేసిన ఎంవీఐ పద్మాకర్‌కు స్కూల్ యాజమాన్యాలు కృతజ్ఞతలు తెలిపాయి. ఎంవీఐలు వై.నాగేశ్వరరావు, జీవీఎస్ఎన్ మూర్తి తదితరులున్నారు.





కాగితపూలు కనువిందు

నగరంలోని పలు ప్రదేశాల్లో రహదారుల డివైడర్ల మధ్య ఎర్రటి కాగితపూలు కనువిందు చేస్తున్నాయి. రామవరప్పాడు, బెంజిసర్కిల్ తదితర ప్రాంతాల్లోని రోడ్ల మధ్య ఉన్న మొక్కలకు కాస్తున్న పూలు ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ